క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

జగన్నాథస్వామి ప్రచార రథం ప్రారంభం



జగన్నాథ స్వామి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో స్వామి ప్రచార రథాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆలయ ఈవో రాజగోపాలరెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు, ఆలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు మారోజు శ్రీనివాస్, కంటుముచ్చు సాగర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ గోడ పనులకు శంకుస్థాపన

అల్లిపురం: ఎన్నో ఏళ్లుగా రంగిరీజు వీధి, సాలీల దిబ్బపై ముగ్గురు అమ్మవార్ల ఆర్చి నిర్మాణం, మెడికల్ కాలేజీ గోడ మరమ్మతులు, పెయింటింగ్ పనులకు 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కందేటి సుధాకర్, చెన్నై శ్రీధర్, ఈశ్వర్ కిషోర్, కేవీ నర్సింగ్, కనకమహాలక్ష్మి, కడియం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు

అల్లిపురం: రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత అని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జోన్–1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శోభారాణి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్లు, హెల్త్ క్లబ్ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించాయి. అనంతరం ఆమె రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దత్తత గ్రామాల్లో ప్రజలకు రక్తదాన ఆవశ్యకతను వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, ఎన్‌వీ పద్మకుమారి, మైక్రోబయాలజీ అధ్యాపకులు జ్యోతి, డాక్టర్ టి.వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ ఉద్యోగుల రక్తదాన శిబిరం

అల్లిపురం: సెవెన్ హిల్స్ ఆస్పత్రి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా బుధవారం ఉచిత బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ మేనేజర్ ప్రఫుల్లకుమార్ సాహు, మేనేజర్లు రామారావు, వరుణ్‌దేవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో 30 మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సెవన్‌హిల్స్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటేష్‌గిరి, కార్పొరేట్ మేనేజర్ సతీష్, ప్రణీత్, సిబ్బంది పాల్గొన్నారు.

రారండోయ్.. వేడుక చూద్దాం

- 17 నుంచి జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు
- 20న తొలి రథయాత్ర
- 21 నుంచి స్వామి దశావతారాలు
- 30న తిరుగు రథయాత్ర



రథయాత్రకు సిద్ధంగా ఉన్న స్వామి రథం



ప్రధాన ఆలయం..



జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి



ఆలయ ముఖ ద్వారం

దాబాగార్డెన్స్ : నగరంలోని టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవం ఈ నెల 17 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 17 శనివారం జ్యేష్ఠ బహుళ చతుర్దశి సాయంత్రం ప్రతిష్టా ప్రారంభ సంకల్పం, 18న అమావాస్య ఉదయం జలాధివాసం, క్షీరాధివాసం, రాత్రి విశేష హోమాలు, పంచశయ్యాది వాసాలు, 19న ఆషాఢ శుద్ధ పాడ్యమి ఉదయం పూర్ణాహుతి నేత్రోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం, సుభద్రాదేవి శాంతి కల్యాణం జరపనున్నారు. 20 ఉదయం ఉదయం 7.35 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5 గంటలకు జగన్నాథ స్వామి తొలి రథయాత్ర ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 21 నుంచి 30వ తేదీ వరకు టర్నర్ చౌల్ట్రీలో గల కల్యాణ మండపంలో దశావతారాల్లో స్వామి భక్తులకు దర్శనమిస్తారు.

తిరుగు రథయాత్ర..

30 ఉదయం 10.05 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 5.10 గంటలకు టర్నర్ చౌల్ట్రీ నుంచి మేళతాళాలు, బాణసంచా, మంగళవాయిద్యాల నడుమ జగన్నాథ నామ స్మరణతో వేద పండితుల పారాయణలతో అత్యంత వైభవంగా తిరుగు రథయాత్ర నిర్వహించనున్నారు. జూలై ఒకటో తేదీ ఉదయం సంప్రోక్షణ, పీఠారోహణం అనంతరం స్వామిని యథాస్థానంలో అధిష్ఠింపజేయనున్నారు.

స్వామి అవతారాలు..

21న మత్స్యావతారం, 22న కూర్మావతారం, 23న వరహావతారం, 24న నృసింహావతారం, 25న వామనావతారం, 26న పరశురామావతారం, 27న శ్రీరామావతారం, 28న బలరామ.. శ్రీకృష్ణావతారం, 29న తొలి ఏకాదశి, శేషపాన్పు అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆలయ చరిత్ర..

విశాఖ మెయిన్‌రోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయం 185 ఏళ్ల చరిత్ర కలిగిన అతి పురాతనమైన ఆలయం. ప్రశాంత వాతావరణంలో ఎంతో మంది కళాకారులకు ఆశ్రయాన్ని కల్పించి, వివిధ కళలకు నిలయమై భక్తుల పాలిట కల్పతరువై వైష్ణవ దేవాలయంగా పేరు గాంచింది. 1832లో ప్రస్తుత ఆలయం ఉన్న ప్రాంతంలో గరుడా జగన్నాయకుల కుటుంబీకులు తవ్వకాలు జరిపినప్పుడు ఆలయంలో ఉన్నటువంటి మహావిష్ణువు రూపుడైన రంగనాథస్వామి పంచలోహ విగ్రహాలు బయల్పడ్డాయి. అప్పుడు స్వామికి చిన్న తాటి ఆకుల పాకవేసి చలమయ్య దీక్షితులను అర్చకులుగా నియమించారు. అనంతరం గరుడా వంశీయుల ఆరాధ్య దైవమైన జగన్నాథస్వామి దేవాలయ నిర్మాణానికి పూనుకుని, 1862లో ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పూరీ నుంచి జగన్నాథ, సుభద్ర, బలభద్రస్వామి విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. 1864 నుంచి ఇక్కడ రథయాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

నిత్యపూజలు..

ఈనెల 21 నుంచి 29 వరకు నిత్యపూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 వరకు నిత్యపూజ, ఉభయదాతల గోత్రనామాలతో పూజాధికాలు, 7 నుంచి 9.30 గంటల వరకు జగన్నాథస్వామి ప్రార్థనా గాన సంఘంచే ప్రార్థనా తరంగిణీ. 9.30 నుంచి 10.30 వరకు లలితా సహస్రనామ పారాయణ, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజుల పాటు పాల్గొనే భక్తులు దేవస్థాన కార్యాలయంలో రూ.500 చెల్లించినచో గోత్రనామాలతో ఆయా రోజుల్లో పూజ జరిపించనున్నారు. దశావతార అలంకరణలు చేయదలచు భక్తులు ముందుగా ఆలయ ఈవో టి. రాజగోపాలరెడ్డిని కార్యాలయంలో సంప్రదించవచ్చు.

కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట : పది, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన కేజీహెచ్ ఉద్యోగుల పిల్లలకు శ్రద్ధ అసోసియేషన్ పురస్కారాలు అందజేసింది. బుధవారం 20 మంది పిల్లలకు ఆర్థిక పురస్కారం, మరో 10 మంది పిల్లలకు కాలేజీ బ్యాగులను సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద ద్వారా అందజేసింది. శ్రద్ధ అసోసియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. సాగర శిరిజ మాట్లాడుతూ శానిటరీ ఉద్యోగుల పిల్లలు, సెక్యూరిటీ ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలు, కాలేజీ బ్యాగులు అందజేశామని తెలిపారు. పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బి. సమీర్ సౌరభ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్న పిల్లలకు అవసరమైన సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్, ఉపాధ్యక్షుడు బి. జగదీశ్, కేజీహెచ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్. అప్పారావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ పాల్గొన్నారు.

కాలువల పరిశుభ్రతకు శ్రీకారం



వెలంపేట వద్ద కాలువలు పరిశుభ్రం చేయిస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ: రానున్న వర్షాకాలం నేపథ్యంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ముందస్తుగా కాలువల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఆయన వార్డులో ముంపు ప్రాంతాలైన వెలంపేట, ప్రసాద్ గార్డెన్స్, పూలసందు, ఆర్ఆర్ ఎంఆర్ రోడ్డు ప్రాంతాల్లో కాలువలు పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్‌తో పాటు అన్ని వీధులు ముంపు ప్రాంతాలన్నారు. లోతట్టు ప్రాంతం కావడంతో కేజీహెచ్‌పై వీధుల నుంచి, ఏవీఎన్ కళాశాల ప్రాంతం నుంచి పూర్ణామార్కెట్ మీదుగా రామకృష్ణ జంక్షన్ వద్ద ఉన్న కెనాల్‌లోకి మురుగు చేరుతుందన్నారు. దీని ద్వారా సముద్రంలో ప్రవేశిస్తుందని తెలిపారు. అయితే మధ్యలో ఎక్కడ వ్యర్థాలు అడ్డుకున్నా పూర్ణామార్కెట్ వద్దే కాలువలు నిండిపోయి వ్యర్థాలతో సహా బయటికి వచ్చి మురుగు కాలువలు రోడ్డుపైకి ప్రవహిస్తాయన్నారు. దీంతో వ్యాపారులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా కాలువలు పరిశుభ్రం చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీలో రక్తదాన శిబిరం



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజుకు స్వాగతం పలుకుతున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికల్ కాలేజీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.బుచ్చిరాజు ప్రారంభించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, వైద్యులు టీవీఎస్ నాయుడు, ఎస్.చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో జరిగిన వైద్య శిబిరంలో 104 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏక్యూజే ప్రసన్నకుమార్, నర్మద చంద్ర, టి.కీర్తిశ్రీ, దొడ్డి ఉదయశ్రీ, కీర్తి సుబ్రహ్మణ్య, సుమిత పోలవరం, అల్లు సాయి మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు



మహిళలకు సీమంతాలు నిర్వహిస్తున్న స్థానిక మహిళలు, పార్టీ నాయకులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పార్టీ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి యాంద్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిలేష్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆడపడుచులకు అన్నివిధాల తోడ్పడుతున్నారని తెలిపారు. ఆరోగ్య భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గవర రమణ, ప్రమీల, పవన్‌కుమార్, దాసు, విజయ్, మధు, జ్యోతి, ఉష, ఆదిలక్ష్మి, దేవి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, ముస్లిం నాయకులు

అల్లిపురం: ముఖ్యమంత్రి కార్యదర్శి కాల్వ ధనుంజయరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నియోజకవర్గ సమస్యలపై బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మహారాణిపేట 30వ వార్డు అంగటిదిబ్బపై నివసిస్తున్న 500 కుటుంబాలకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని, ముస్లిం స్మశాన వాటికకు మధురవాడలో స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట, 31వ వార్డు ఎల్లమ్మతోట ప్రాంతాల్లో నివాస స్థలాల సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రెండు వారాల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసిన వాసుపల్లి గణేష్‌కుమార్ 38వ వార్డు రీడింగ్ రూమ్, కనకమహాలక్ష్మి ఆర్చి నుంచి బీచ్‌రోడ్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలని, ఇరుగ్గా ఉండే ఘోషా ఆస్పత్రి రోడ్డు విస్తరించాలని కోరారు. అలాగే 30వ వార్డు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్యాణ మండపం ఆర్చ్ నుంచి కోడి పందాల వీధి వరకు వెళ్లే మార్గాన్ని విస్తరించాలన్నారు. ఆయనతో పాటు సౌత్ ముస్లిం నాయకులు ఖాజావల్లి, ముజీబ్‌ఖాన్, బాబ్జి, ఖయ్యుమ్‌ఖాన్, అబ్బుఖాన్, రవ్వాని, అన్వర్ బేగ్, 32వ వార్డు అధ్యక్షుడు మూలే రామిరెడ్డి, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, శివ, శ్రీను, బ్రహ్మాజీ, విజయ్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరింగ్ ప్రారంభం



బోరింగ్‌ను ప్రారంభిస్తున్న చెన్నా జానకిరామ్

అల్లిపురం : జీవీఎంసీ 37వ వార్డు పరిధి రామ్‌నాథ్ హోటల్ దగ్గర మంచినీటి బోర్‌ను వార్డు కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ బుధవారం ప్రారంభించారు. స్థానికులు తమ అవసరాల నిమిత్తం పబ్లిక్ బోరింగ్ వేయాలని కోరడంతో జానకిరామ్ స్పందించి జీవీఎంసీ అధికారులతో మాట్లాడి బోరింగ్ వేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూజీడీ ఏఈ వాసుదేవ్, వార్డు ఇన్‌చార్జి ఆకుల ఏసు, ఏపీ టూరిజం డైరెక్టర్ డేవిడ్‌రాజు, సీనియర్ నాయకుడు వాసు, వార్డు మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె

తాటిచెట్లపాలెం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రక్తదాత్ అమృత్ మహోత్సవ్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను వివరించారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర సమయాల్లో కొందరి ప్రాణాలను రక్షించిన వారమవుతామని పేర్కొన్నారు. శిబిరంలో రక్తదాతలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తరచూ రక్తదానం చేసే వారిని గుర్తించి పోర్టు అధికారులు ఘనంగా సత్కరించారు. పోర్టులోని అన్ని విభాగాల సిబ్బంది రక్తదానంపై ప్రమాణం చేశారు. 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పోర్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషాదేవి, విభాగాధిపతులు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్, గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ సిబ్బంది, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన నల్ల పసుపు పుష్పం



మహారాణిపేట : ఎన్నో ఔషధ గుణాలున్న నల్ల పసుపు పుష్పం వికసించింది. అరుదైన ఈ పుష్పం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి తిరునగరి సాయిప్రకాష్ ఇంట్లో పూసింది. ఆయన మిథిలాపురి రెవెన్యూ కాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రతి ఇంటా పది మొక్కలు పెంచే స్థాయికి దీనిని తీసుకెళ్లాలని ప్రకాష్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు అన్యాయం



853వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో తీసుకుంటున్న నిర్ణయాలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 853వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి అమ్మే మాత్రం హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందని, వారి ఆటలు ఇక సాగవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగులను సత్కరిస్తున్న డీఎంవో మణి, నగేష్ పట్నాయక్

సీతంపేట: నగరంలోని జిల్లా మలేరియా సబ్ యూనిట్ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు సహోద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వై.మణి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కె.వెంకటరావు, ఆర్.వి.లోకనాథం, బి.ఎస్.వర్ధన్ సబ్‌యూనిట్‌లో మంచి సేవలు అందించారని, భవిష్యత్‌లో కూడా అదేవిధంగా సేవలందించాలని కోరారు. అనంతరం వారిని దుశ్శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన మరో ముగ్గురు సూపర్ వైజర్లు సత్యానందం, జి.వి.రవికుమార్, రామి నాయుడులకు సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు బి.కుమార్, రత్నం, మహాదాత, రామకోటి, కుమార్, హెల్త్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అంబేడ్కర్ నగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు అంబేడ్కర్ నగర్, బాపూజీనగర్ కొండవాలు ప్రాంతాల్లో బుధవారం అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, మెట్ల మార్గాలకు మరమ్మతులు, డ్రెయిన్ల పనులు చేపట్టనున్నట్లు జోన్–5 ఏఈ అర్చన తెలిపారు. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు, వార్డు నాయకులు వసంతల అప్పారావు, వీర రాఘవులు, విజయ్, సురేష్, కనకరాజు, చందురెడ్డి, భోగి, ముక్క రమణ, గోవింద్, నరసింగ్, గురువోజీ, అప్పన్న దొర, లక్ష్మణ్‌సాయి, అనిల్‌కుమార్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌కు అవార్డు



అవార్డుతో భానుప్రకాష్

అల్లిపురం: అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్టర్ ఇండియా గ్లామర్ గ్లోబల్ ఇంటర్నేషనల్ ఆసియా–2023 అవార్డు నగరానికి చెందిన చిల్లా భానుప్రకాష్‌రెడ్డిని వరించింది. ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు స్వీకరించారు. భానుప్రకాష్ బాక్సింగ్‌లో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో మూడుసార్లు బంగారు పతకాలు సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్‌గా పనిచేశారు. ప్రస్తుతం కల్ప్రెట్ ఫిట్‌నెస్ కంపెనీలో బాక్సింగ్ ఫిట్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలందిస్తున్నారు. భానుప్రకాష్‌కు అవార్డు రావడం పట్ల నగరంలో ప్రముఖులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఇష్టానుసారం ఆటోలు నిలిపితే చర్యలు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రమేష్

సింహాచలం : రోడ్లపై ఇష్టానుసారం ఆటోలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ ఆటోడ్రైవర్లకు సూచించారు. 94వవార్డు పరిధి వేపగుంట వద్ద రోడ్డుపై ఆటోలను ఇష్టానుసారం నిలిపి వాహనాల రాకపోకలకు అవాంతరాలు సృష్టిస్తుండటంతో పాటు ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వేపగుంట జంక్షన్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ సమస్యలు సృష్టించడం వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ట్రాఫిక్‌కు అవాంతరాలు కల్పిస్తే మాత్రం కేసులు నమోదు చేస్తామన్నారు.